

గోరింటా పూసింది..!





మహిళల చేతులు ఎంతో సున్నితం.. వాటికి గోరింటాకు రాస్తే ఎంతో చూడముచ్చటగా ఉంటాయి. చేతి నిండా గోరింటాకు పెట్టుకొని ఎర్రగా పండిన ఆ చేతులను చూస్తే చూడముచ్చటేస్తుంది. మహిళలు వాటిని చూసుకొని మురిసిపోతుంటారు.

అయితే, ఆషాఢమాసంలో ఈ గోరింటాకు సందడి ఎక్కువగా ఉంటుంది. పట్టణాలు, గ్రామాలలో మహిళలు, యువతులు, చిన్నారుల చేతులు గోరింటాకుతో కళకళలాడుతున్నాయి. ఆధునికతను జోడించి మహిళలు ఒకరికొకరు పోటీ పడి గోరింటాకు పెట్టుకుంటున్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆషాఢమాసం నేపథ్యంలో గురువారం స్థానిక షిరిడీ సాయిబాబా దేవాలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు సంబురాలు నిర్వహించారు. యువతులు, విద్యార్థినులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకుంటే రుతువు మారిన వేళ కాళ్లు, చేతులు, గోళ్లు శుభ్రపడుతాయని, రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు అంటువ్యాధులు కూడా దరిచేరవని చాలామంది భావిస్తుంటారు.

ఆమనగల్లు, జూలై 11

- ఇంకుడుగుంతల నిర్మాణం, తోటల పెంపకం అభినందనీయం
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కోర్స్ డైరెక్టర్ లఖన్‌సింగ్
- ఉపాధిహామీ పథకం పనులపై వివిధ రాష్ట్రాలకు చెందిన డీఆర్‌డీపీ బృందం కితాబు
- యాచారం మండలం గడ్డమల్లాయగూడలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనుల పరిశీలన



గడ్డమల్లాయగూడలో ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న డీఆర్‌డీపీ బృందం

ఉపాధి పనులు భేష్!



యాచారం, జూలై 11 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు భేషుగ్గా ఉన్నాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కోర్స్ డైరెక్టర్ లఖన్‌సింగ్ అన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం, పండ్లతోటల పెంపకంతో పాటు పంట పొలాల్లో చేపట్టిన పనులపై కితాబిచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పంట పొలాలను అభివృద్ధి చేయడం, పండ్లతోటల పెంపకం చేపట్టడం ద్వారా రైతులు ఆర్థికంగా వృద్ధి చెందేలా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం అమలు చేయడం ప్రశంసనీయమని అన్నారు. సేద్యానికి పనికిరాని భూములను చదును చేసి పండ్లతోటలు పెంచడం చాలా బాగుందని ఆయన అన్నారు. మేనేజ్‌మెంట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ లీడర్‌షిప్ అంశంపై రాజేంద్రనగర్‌లో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, కేరళ, ఒరిస్సా, నాగాలాండ్, జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన డీఆర్‌డీఏ అధికారుల బృందం గురువారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నేల చదును చేసి సీతాఫలం, జామ తదితర తోటలను పెంచే విధానాన్ని బృందం పరిశీలించి తోటల పెంపకం విధానంపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పండ్ల మొక్కలు ఎక్కడి నుంచి.. ఎంత ధరకు తెచ్చారు? మొక్క పెంపకం విధానం, తదితర వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో చెత్తను సేకరించే విధానాన్ని గ్రామస్తులతో పాటు అధికారులను అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి, సేంద్రియ ఎరువుగా తయారు చేసే విధానం చూసి సంతృప్తి చెందారు. చెత్తను గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డుకు తరలించి ఎరువు తయారు చేయడంతో గ్రామంలో దుర్గంధం లేకుండా చేస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. హరితహారం నర్సరీని పరిశీలించి విత్తనాలు ఎక్కడి నుంచి తెచ్చారు? నర్సరీ నిర్వహణ విధానంపై నిర్వాహకులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. నర్సరీలో మొక్కలు ఏపుగా పెరిగిన తరువాత వానాకాలంలో ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి మొక్కలు నాటిస్తున్నట్లు ఎంపీడీవో నరేందర్‌రెడ్డి వారికి వివరించారు. వరద నీరు వృథా పోకుండా ఇంకుడు గుంత తవ్వి నీరు నిల్వ చేసే విధానాన్ని డీఆర్‌డీఏ బృందం పరిశీలించింది. ఇంకుడు గుంతలో నీటిని నిల్వ చేస్తే పశువులు తాగడంతో పాటు భూగర్భ జలం పెరుగుతుందని ఉపాధి కూలీలకు అధికారుల బృందం సూచించింది. స్వయం సహాయక సంఘంలో రుణం తీసుకొని కారంపొడి తయారు చేస్తున్న విధానం చూసి మహిళలను అభినందించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డుల మెయింటెనెన్స్ తీరు చూసి సంతృప్తి చెందారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు పలు సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్న విధానాన్ని ఎంపీడీవో నరేందర్ రెడ్డి వారికి వివరించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్రాల నుంచి అందుతున్న నిధులను ప్రజలకు చేరే విధానాన్ని బృందానికి వివరించారు. కార్యక్రమంలో జిల్లా డీఆర్‌డీఏ అదనపు పీడీ సుభాషిణి, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఏపీడీ సక్రియా, ఎంపీవో శ్రీలత, ఏపీవో లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.





బీఆర్ఎస్‌కు దెబ్బమీద దెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్‌లోకి పలువురు జంప్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో నగర శివారుకు చెందిన మరో ఆరుగురు ఎమ్మెల్యేలు కూడా గోడ దూకడానికి సిద్ధంగా ఉన్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. నగర శివారు ప్రాంతాల్లోనే బీఆర్ఎస్‌కు ఎక్కువ ఎమ్మెల్యే స్థానాలు వచ్చాయి. ఇప్పుడు వారంతా కాంగ్రెస్ వైపు చూస్తుండడం బీఆర్ఎస్‌కు పెద్ద దెబ్బే.

- దశల వారీగా చేరికలు
- నేడు హస్తం గూటికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

బీఆర్ఎస్‌కు మరో దెబ్బ!

కాంగ్రెస్‌లోకి ఆరుగురు శివారు ఎమ్మెల్యేలు !

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

అధికార కాంగ్రెస్ పార్టీ మొదలు పెట్టిన ఆపరేషన్ ఆకర్ష్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చివరి అంకానికి చేరుకుంది. నగర శివార్లలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరినీ తమ గూటికి తెచ్చుకునేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు దాదాపు కొలిక్కి వచ్చాయి. నగర శివార్లలోని ఆరుగురు ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖరారైంది. అయితే దశల వారీగా ఈ చేరికలు జరగనున్నాయి. నేడు (శుక్రవారం) రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఆయనతో పాటు ఇద్దరు మున్సిపల్ చైర్మన్లు, మరికొందరు అనుచరులు కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. కొంత కాలం కిందట ప్రకాష్‌గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి గంటసేపు మంతనాలు జరిపారు. ఈ విషయం తెలిసి బీఆర్ఎస్ నాయకత్వం అప్రమత్తమై ఆయన్ని బుజ్జగించింది. దీంతో ఆయన కొన్నాళ్లుగా స్తబ్ధతగా ఉన్నారు. అయితే స్థానిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఆయన అధికార పార్టీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. అలాగే సోమవారం లేదా మంగళవారం మరో ఇద్దరు ఎమ్మెల్యేలు చేరనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఒక ఎమ్మెల్యే బీఆర్ఎస్‌ను వీడగా మిగతా వారు కూడా కాంగ్రెస్‌వైపు చూస్తున్నట్లు కొంతకాలంగా ప్రచారం సాగుతోంది. ఇటీవల చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. మిగతా వారు కూడా ఆయన బాటలోనే బీఆర్ఎస్‌ను వీడేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ 10 అసెంబ్లీ సీట్లు కైవసం చేసుకోగా వీరిలో ఒకరిద్దరు మినహా మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు కొద్ది రోజులుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే కొందరు సీఎం రేవంత్‌రెడ్డితో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఒకేరోజు కాకుండా దశల వారీగా వీరి చేరికలు ఉండే విధంగా కాంగ్రెస్ ప్లాన్ చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెంచండి

- జిల్లా కలెక్టర్ శశాంక



డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం, జూలై 11: ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శశాంక వైద్యాధికారులకు సూచించారు. ఓపీ, ఇన్ పేషెంట్ల సంఖ్య పెరగాలని కూడా ఆయన ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రులకు వెళ్తే మంచి వైద్యం అందుతుందని ప్రజల్లో నమ్మకం కలగాలంటే ఆ దిశగా వైద్యసేవలు అందించాల్సి ఉందన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఇదే ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు వికటించి నలుగురు మహిళలు మృతి చెందిన ఘటన నుండి ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు. శానిటేషన్ వ్యవస్థను మెరుగు పర్చాలని ఆయన ఆదేశించారు. ఆసుపత్రిలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని, సెక్యూరిటీని కూడా నియమించుకోవాలన్నారు. వైద్యులతో పాటు సిబ్బంది కూడా సమయానుకూలంగా విధుల్లో ఉండాలని.. లేదంటే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని లేదంటే ఏజెన్సీలను మార్చాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ప్రతీ విద్యార్థికి ఓ లక్ష్యమంటూ ఉండాలని.. దాని కోసం కష్టపడి చదవాలన్నారు. పదో తరగతే విద్యార్థికి మొదటి మైలురాయని.. ఏ కోర్సును ఎంచుకున్నా తగు కార్యాచరణతో ముందుకు పోతేనే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుని చదువులకు పంపిస్తున్నారని వారి కలలను నిజం చేయాలనే తపన విద్యార్థికి ఉండాలన్నారు. ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ఇక్కడ బాలికల మూత్రశాలల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నందున వీటిని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం మండల పరిషత్తు, ఆర్డీవో కార్యాలయాలను కలెక్టర్ శశాంక సందర్శించారు. ఆయన వెంట జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, ఎంఈవో వెంకట్‌రెడ్డి, తహసీల్దారు అనిత, ఎంపీడీవో వెంకటమ్మ, ఏఈ ఇంద్రసేనారెడ్డి తదితరులు ఉన్నారు.

పోలీసుల అదుపులో 'రియల్టర్ హత్య' నిందితులు!



షాద్‌నగర్ రూరల్, జూలై 11 : కమ్మదనం ఫాంహౌజ్‌లో బుధవారం జరిగిన కమ్మరి కృష్ణ హత్య కేసులో నిందితులు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. హత్యకు గల కారణాలను పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు. రియల్ఎస్టేట్ వివాదాలే కారణమని, కుటుంబ సభ్యులపై కూడా అనుమానాలు ఉన్నాయని అనుమానిస్తున్నారు. హత్యకు గురైన కృష్ణకు చాలా కాలంగా బాడీగార్డుగా, ప్రధాన అనుచరుడిగా ఉన్న రాజేంద్రనగర్ కిస్మత్‌పురాకు చెందిన దేవానంద్ ముదిరాజ్ అలియాస్ బాబాను విభేదాల కారణంగా ఏడాది క్రితం దూరంగా పెట్టాడు. ఈక్రమంలో 15 రోజుల కింద బాబా కృష్ణను బతిమాలి తిరిగి అతడి వద్ద ఉంటున్నాడు. బుధవారం కృష్ణ హత్యలో బాబా ప్రధాన నిందితుడిగా పోలీసులు అనుమానించారు. కాగా, పథకం ప్రకారమే బాబాను కృష్ణతో విభేదాలున్న కొందరు వ్యక్తులు పనిలో పెట్టినట్లు అనుమానిస్తున్నారు. చాలా కాలం నుంచి నమ్మకంగా ఉన్న బాబాతోనే కృష్ణను హతమార్చాలని పన్నాగం పన్నినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు ముందు కారులో గేటు బయట ఉన్న సందీప్, జగదీష్‌లు ఇంటి లోపల నుంచి బాబా కేకలు(సిగ్నల్) వేయగానే వెళ్లి కృష్ణను హత్య చేసి పరారయ్యారు. సందీప్, జగదీష్ ఎక్కడి నుంచి వచ్చారనే విషయం తేలాల్సి ఉంది. వాళ్ల ఇద్దరు సుపారి గ్యాంగ్‌కు చెందినవారా? లేకా బాబా తీసుకువచ్చాడా? అనే విషయం తేల్చాల్సి ఉంది. కృష్ణకు, మొదటి భార్య కుమారులకు మధ్య విబేధాలు ఉన్నట్లు సమాచారం. తమను నిర్లక్ష్యం చేస్తున్నాడని కృష్ణపై కోపం పెంచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కృష్ణ వివాదాస్పద భూములు తక్కువ ధరకు కొని ఎక్కువకు విక్రయించేవాడని సమాచారం. హైదర్షాకోట్ ప్రాంతంలో కేకే పేరుతో వెంచర్లు చేసి బిల్డర్‌గా ఎదిగాడు. రియల్ వ్యవహారాల్లో అయిదారు మందితో తీవ్ర విబేధాలు ఉన్నట్లు సమాచారం. మూడో భార్య పావని, ఆమె పిల్లలతోనే కృష్ణ ఎక్కువగా గడిపేవాడని, అందువల్లే మొదటి భార్య కుమారులు తీవ్రంగా విబేధించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలను ఆ కోణంలోనూ విచారణ చేస్తున్నారు. అయితే, హత్య అనంతరం నిందితులు నేరుగా శంషాబాద్ పోలీసులకు లొంగిపోయారని, విచారణలో నిందితులు నోరు తెరవడం లేదని సమాచారం. శంషాబాద్ పోలీసులకు లొంగిపోయిన నిందితులను సీసీఎస్ పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.



శిక్షణను ప్రారంభిస్తున్న అధికారులు

మానవ అక్రమ రవాణా నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి

- డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ నిర్మల

చేవెళ్ల, జూలై 11 : మానవ అక్రమ రవాణా నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ నిర్మల తెలిపారు. గురువారం చేవెళ్లలోని స్త్రీశక్తి భవన్‌లో మానవ అక్రమ రవాణా అంశంపై డీఆర్‌డీఏలో పనిచేస్తున్న వీఓఏలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం ప్రజలందరి భాగస్వామ్యం అవసరమన్నారు. మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే మూడో అతి పెద్ద నేరం అని చెప్పారు. ప్రతినిత్యం ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీని బారిన పడుతున్నారని నిర్మల తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి వారు, ఉద్యోగం, ప్రేమపెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురి అవుతున్నారన్నారు. ప్రతీ ఒక్కరు దీనిపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిక్షణలో మానవ అక్రమ రవాణా ఎలా జరుగుతుంది, ఎవరు దీనికి గురవుతారు, లైంగిక వ్యాపారంలోకి వెళ్లిన అమ్మాయిల పరిస్థితులు ఎలా ఉంటాయి, సైబర్ ట్రాఫికింగ్ (ఆన్‌లైన్ మోసాలు) ఎలా జరుగుతున్నాయి అనే అంశాలను వివరించారు. ఈ సమావేశంలో సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ, ఏపీఎం శోభారాణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


నేడు ఆమనగల్లులో పూరీ జగన్నాథ్ రథయాత్ర

- ఆమనగల్లుకు చేరుకున్న రథం
- స్వాగతం పలికిన మహిళలు
- రథయాత్రకు భారీ ఏర్పాట్లు

ఆమనగల్లు, జూలై 11:ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం పూరీ జగన్నాథ్ రథయాత్ర నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ఇస్కాన్ దేవాలయం వారి సహకారంతో నిర్వహించే రథయాత్రకు నిర్వాహకులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఇస్కాన్ టెంపుల్ నుంచి గురువారం రథం ఆమనగల్లు పట్టణానికి చేరుకుంది. స్థానిక మార్కండేయ దేవాలయం వద్ద మహిళలు మంగళ హారతులతో రథానికి స్వాగతం పలికారు. పలువురు విదేశీ భక్తులు కూడా ఆమనగల్లుకు చేరుకున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ, కల్వకుర్తి మండలాల నుంచి నేడు జరిగే జగన్నాథ్ రథయాత్రకు జన సమీకరణ చేస్తున్నట్లు రథయాత్ర వ్యవస్థా ప్రముఖ్ పాపిశెట్టి రాము, కన్వీనర్ తల్లోజు వెంకటయ్య, శోభ యాత్ర ప్రముఖ్ ఎంగళి బాలకృష్ణ లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు స్థానిక శ్రీ అయ్యప్పకొండ నుండి రథయాత్ర ప్రారంభమై బస్టాండ్ మీదుగా కొనసాగుతుందని పేర్కొన్నారు. కన్యకాపరమేశ్వరి, మార్కండేయ స్వామి దేవాలయాలలో పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాము కోరారు.



రథానికి స్వాగతం పలుకుతున్న మహిళలు



కరుణించని వరుణుడు

- కార్తెల్లో చిరుజల్లులకే పరిమితం
- బోసిపోయిన చెరువులు, కుంటలు
- వర్షాల కోసం అన్నదాతల ఎదురు చూపు


అడుగంటిన కులకచర్ల మైలమ్మ చెరువు


ఇప్పయిపల్లిలో సాగుకు నోచుకోని భూములు

కులకచర్ల, జూలై 11: ఉమ్మడి కులకచర్ల మండలంలో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటలు అడుగంటుతున్నాయి. వర్షం కురిస్తే దున్నకాలు చేపడదామని రైతులు అన్నీ సిద్ధం చేసుకున్నారు. ముందు మురిపించిన వరుణుడు ప్రస్తుతం ముఖం చాటేయడంతో ఇప్పటి వరకు వరినాట్లు ప్రారంభించలేదు. తూకం పోసేందుకు చినుకు కోసం ఆకాశం వైపు రైతులు ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి కులకచర్ల మండలంలో 34గ్రామాల్లో మొత్తం 10నోటిఫైడ్ చెరువులు, వందకుపైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. గతేడాది కూడా ఈ ప్రాంతంలో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటల్లో నీరు చేరలేదు. ఈసారి కూడా ఇప్పటి వరకు ఆశించిన వర్షాలు కురవలేదు. మృగశిర, అరుద్ర కార్తెలో చిరుజల్లులు కురిశాయి. సాగుకు సిద్ధమవుతున్నా వర్షాలు కురవకపోవడంతో ఆయకట్టు రైతులు దుక్కి దున్నకుండా చినుకు కోసం ఎదురు చూస్తున్నారు. బోరుబావుల్లో నీటి మట్టం తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పూసల కార్తె ప్రారంభమైనా ఇప్పటికీ భారీవర్షం పడలేదు. దీంతో రైతులు ఈసారి కూడా వ్యవసాయం కష్టమే అంటూ ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిస్తే మండలంలోని 12వేల ఎకరాలకు పైగా వరిసాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

వెలవెలబోతున్న చెరువులు, కుంటలు

వర్షాలు సకాలంలో కురవకపోవడంతో మండలంలోని చెరువులు, కుంటలన్నీ వెలవెలబోతున్నాయి. నీరు లేక కులకచర్ల మైలమ్మ చెరువు, కామునిపల్లి చెరువు, అంతారం పాటిమీది చెరువు, ముజాహిద్‌పూర్ అక్కమ్మ చెరువుతో పాటు ఆయా గ్రామాల్లో చెరువు కుంటలన్నీ బోసిపోతున్నాయి. ఆయాగ్రామాల ఆయకట్టు రైతులు చెరువు కుంటలు నిండితే వరిసాగు చేస్తారు. కానీ వర్షాలు లేక తూకాలు పోసి వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు.

వరి సాగు కష్టమే



వర్షాలు ఇలాగే ఉంటే ఈ సారి కూడా వరి సాగు కష్టమే. తిరుమలాపూర్ గ్రామ చెరువు ఆయకట్టు కింద రెండు ఎకరాల భూమి ఉంది. 20 రోజుల కిందటే తుకం కోసం భూమి చదును చేశాను. కానీ ఇప్పటి వరకు వర్షం కురవకపోవడంతో తుకం పోయలేదు. వానొస్తేనే దున్నడమవుతుంది. - రాములుగౌడ్, రైతు, తిరుమలాపూర్

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి


కేజీబీవీ సందర్శనలో డీఎంహెచ్‌వో పల్వాన్ కుమార్

వికారాబాద్, జూలై 11: విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వాన్ కుమార్ అన్నారు. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని కేజీబీవీపీ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. వంటశాల, నీటి సరఫరా పైపులైన్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడ హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని హాస్టల్స్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేసే నాన్ టీచింగ్ స్టాఫ్ ఫుడ్ హ్యాండ్లర్స్‌కు ఏమైనా అంటువ్యాధులు ఉన్నాయనేది గుర్తించడానికి హెల్త్ స్క్రీనింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా సిబ్బందికి ఏమైనా వ్యాధులుంటే వారికి చికిత్స అందించి ప్రాథమిక దశలోనే వ్యాధిని నివారించడమే కాకుండా వీరి నుంచి విద్యార్థులకు సంక్రమించకుండా జాగ్రత్తపడుతున్నామన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

జనాభా నియంత్రణకు ట్యుబెక్టమీ, వ్యాసెక్టమీ ఆపరేషన్లు

» జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు

రంగారెడ్డి అర్బన్, జూలై 11 : జనాభా నియంత్రణకు ట్యుబెక్టమీ, వ్యాసెక్టమీ ఆపరేషన్లు చేస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో జిల్లాలో 6,753 కుటుంబ నియంత్రణ చికిత్సలు, 21 ఎన్‌ఎస్‌వీ (కుట్టులేని శస్త్రచికిత్సలు), తాత్కాలిక పద్ధతుల్లో 11,600 మందికి ఐయూసీడీ, 12,963మందికి నిరోధ్(కండోమ్‌లు) పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈఎంవో శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద రిటైర్డ్ ఉద్యోగులు

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్, జూలై 11: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి కోరారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఆర్‌సీ 2023 అమలు చేయాలని, నాలుగు డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ హెచ్‌ఎస్ వైద్య చికిత్సలకు నగదు రహిత వైద్యం అందించాలన్నారు. జిల్లా స్థాయిలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. మెడికల్ అలవెన్స్ రూ.600 నుంచి రూ.4వేల వరకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన వస్తువులను అమ్మితే కేసులు



తనిఖీచేస్తున్న తూనికలు, కొలతల జిల్లా అధికారి రియాజ్ అలీఖాన్

మోమిన్‌పేట్, జూలై 11: నాణ్యత లేని, కాలం చెల్లిన వస్తువులను అమ్మితే కేసులు నమోదు చేస్తామని తూనికలు, కొలతల వికారాబాద్ జిల్లా అధికారి రియాజ్ అలీఖాన్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని కిరాణ దుకాణాలు, హార్డ్‌వేర్ దుకాణాల్లో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. నాలుగు కిరాణా దుకాణాల్లో కాలం చెల్లిన మిక్చర్ ప్యాకెట్లు ఉండగా కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. అదేవిధంగా హార్డ్‌వేర్ దుకాణంలో నకిలీ వస్తువులను గుర్తించి వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. తూనికలు, కొలతల్లో తేడా ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వహీద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వేధిస్తున్నాడని ఫిర్యాదు



ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న నరేందర్

శంషాబాద్, జూలై 11 : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తనను వేధిస్తున్నాడని ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాకు ఫిర్యాదు చేసినట్లు పీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జె.నరేందర్ తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన సాతంరాయిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని సాతంరాయి గ్రామంలో సర్వేనెంబర్ 17లో తన తండ్రి, దివంగత జంగయ్యకు 12 ఎకరాల భూమి ఉందని, ఇటీవల తన తండ్రి మృతిచెందే వరకూ సాగుచేశాడని పేర్కొన్నారు. ఈభూమిపై చట్టబద్ధమైన ఆధారాలు ఉన్నాయని, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తన హోదాతో అక్రమంగా ప్రవేశించేందుకు ఓ కాంట్రాక్టర్ ద్వారా ఆ భూమిలో నిర్మాణం చేయించే ప్రయత్నం చేశారని తెలిపారు. తన తాను, కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురయ్యామని, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.



ఫారెస్ట్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

'డెన్స్ ప్లాంటేషన్'తో అభివృద్ధి

కేశంపేట, జూలై 11: డెన్స్ ప్లాంటేషన్‌తో ఫారెస్ట్‌లు అభివృద్ధి చెందుతాయని ఫారెస్ట్ రేంజర్ వెంకటయ్య తెలిపారు. మండల పరిధిలోని కొత్తపేట అటవీ ప్రాంతంలో గురువారం తలకొండపల్లి, కేశంపేట మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి ప్లాంటేషన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు ఏ విధంగా నాటుకోవాలో ఆయన వివరించారు. కమ్యూనిటీ ప్లాంటేషన్, డెన్స్ ప్లాంటేషన్ ఎలా ఏర్పాటు చేయాలో వివరించారు. అనంతరం అటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేశంపేట, తలకొండపల్లి ఎంపీడీవోలు రవిచంద్రకుమార్‌రెడ్డి, శ్రీకాంత్, బీట్ ఆఫీసర్ రవీందర్‌గౌడ్, ఏపీవో అజీజ్ పాల్గొన్నారు.

బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందనలు



నూతి శ్రీకాంత్‌గౌడ్‌కు అభినందనలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 11: తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా గురువారం బాధ్యతలను స్వీకరించిన నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవనంలో నిర్వహించిన పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకులు జి.బాల్‌రాజ్‌గౌడ్, ఎన్.చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డిలు వెళ్లి శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానించి, అభినందనలు తెలిపారు.

సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలి

» కలెక్టర్‌కు జిల్లా విద్యుత్ శాఖ అధికారుల వినతి

» మెరుగైన కరెంట్‌కు కొత్త సబ్‌స్టేషన్లు

రంగారెడ్డి అర్బన్, జూలై 11 : జిల్లా పరిధిలో 25 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని జిల్లా కలెక్టర్ శశాంకకు విద్యుత్‌శాఖ అధికారులు విన్నవించారు. జిల్లా పరిధిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. పట్టణీకరణ శరవేగంగా విస్తరిస్తోంది. ప్రతీనెలా కొత్తగా వేల సంఖ్యలో వినియోగదారులు చేరుతోన్నారు. అలాగే దేశీయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు అంతరాయం లేని సరఫరాను అందించాలంటే.. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఆ శాఖ చర్యలు చేపడుతోంది. జిల్లాలో 400 కేవీ ఉపకేంద్రాలు 4, 220/132 కేవీ ఉపకేంద్రాలు 10, 132/33 కేవీ ఉపకేంద్రాలు 23, 33/11కేవీ ఉపకేంద్రాలు 241 ఉన్నాయి. వివిధ కేటగిరీల కింద మొత్తం 20,99,777 వినియోగదారులు ఉన్నారు. రోజువారీ సగటు విద్యుత్ వినియోగం 23.6 మి.యూ ఉండగా.. అత్యధిక విద్యుత్ డిమాండ్ 856.94 మెగావాట్లుగా ఉంది. ప్రస్తుతం వినియోగిస్తున్న ఫీడర్లపై లోడ్ ఎక్కువ కావడంతో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు జిల్లాలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 25 నిర్మించాలనుకుంది. ఈ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమిని కేటాయించాలని జిల్లా కలెక్టర్ శశాంకకు జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు అభ్యర్థించారు.

రంగారెడ్డి జిల్లాలో సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్ విద్యుత్ సర్కిళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 25 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు భూమి అవసరం కానుంది. స్థల సేకరణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సైబర్‌సిటీ విద్యుత్ సర్కిల్ పరిధిలో ఆరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. బొటానికల్ గార్డెన్, నెక్నమ్‌పూర్, నిలగడ్డ హుడా, హఫీస్‌పేట్, 8వ బెటాలియన్ పోలీస్ ప్రాంతంలో 2000 గజాలు, మంచిరేవులలో 24,200 గజాలు స్థలం ఇవ్వాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. అలాగే రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ పరిధిలో అత్యధికంగా ఎనిమిది 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. వీటి నిర్మాణానికి రాజేంద్రనగర్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో 1500 గజాలు, హిమాయత్‌నగర్ సర్వేనెంబర్ 62లో 1500 గజాలు, కిస్మత్‌పూర్‌లోని సర్వేనెంబర్ 161లో 1500 గజాలు, గగన్‌పహాడ్‌లోని సర్వేనెంబర్ 30లో 1500 గజాలు ఇవ్వాలని కోరారు. లక్ష్మిగూడ హౌజింగ్ బోర్డు కాలనీలో 2000 గజాలు, బండ్లగూడలోని సర్వేనెంబర్ 82లో 2000 గజాలు, అలీనగర్‌లోని రెగల్ కన్వెన్షన్ పరిధిలో 2000 గజాలు, శంషాబాద్‌లోని హుడా కాలనీలో 1500 గజాలు, అలాగే పద్మావతి కాలనీలో 1500 జగాలు ఇవ్వాలని కోరారు. రాజేంద్రనగర్ మీరాలం పార్కు సమీపంలో 1500 గజాలు, కింగ్ కాలనీ-కాటేదాన్‌లో 1500 గజాలు, జల్‌పల్లిలో 1500 గజాలు, బండ్లగూడలోని డబుల్‌బెడ్‌రూం పరిధిలో 1500 జగాలు ఇవ్వాలని కోరారు. సరూర్‌నగర్ పరిధిలో ఐదు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించాలని నిర్దేశించారు. సరూర్‌నగర్ పరిధిలోని ఫతుల్లాగూడలో 2000 గజాలు, రెడ్డికాలనీలో 2000 గజాలు, చైతన్యనగర్‌లో 2000 గజాలు, బడంగ్‌పేట్ డంపింగ్ యాదవ్ సమీపంలో 2000 గజాలు, మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద 2000 గజాలు ఇవ్వాలని విద్యుత్‌శాఖ కోరింది. అందుకు జిల్లా కలెక్టర్ శశాంక సానుకూలంగా స్పందించారు. సంబంధిత తహసీల్దార్లను భూమి ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం.

రూ.2వేల కోట్లతో

రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ

మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో వందల కోట్లతో పనులు

» మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ » మేడ్చల్ ప్రాంతంలో రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి పనుల పరిశీలన

మేడ్చల్ టౌన్, జూలై 11: సికింద్రాబాద్, కాచిగూడ, అలాగే జంట నగరాల పరిధిలోని పలు రైల్వే స్టేషన్లను, అలాగే మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని స్టేషన్లనూ రెండువేల కోట్ల రూపాయలతో ఆధునికీకరిస్తున్నట్టు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. గురువారం మేడ్చల్, గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి పరిధుల్లో రైల్వే శాఖ చేపడుతున్న రైల్వే అండర్‌పాస్ వంతెనలను ఆయన రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. రైల్లే స్టేషన్ల అభివృద్ధి, ట్రాక్ పనులు, అండర్‌పాస్‌లు, రైల్వే బ్రిడ్జిల కోసం రైల్వేశాఖ వందల కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలందించటంతో పాటు మారుమూల ప్రాంతాలకు రైల్వే సేవలు విస్తరించేందుకు కేంద్రం ప్రభుత్వం పనులు చేపట్టిందన్నారు. మల్కాజ్‌గిరి ప్రాంతంలోని అన్ని రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు ప్రతిపాదన పంపుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే మేడ్చల్ రైల్వే స్టేషన్‌కు రూ.32కోట్లు మంజూరు కాగా పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి సమీప ప్రాంతాలకు నడుస్తున్న లోకల్, ఎంఎంటీఎస్ సేవలను మరింత విస్తరించేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా కొత్త రైల్వే స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చాలా రైల్వే స్టేషన్లు బ్రిటీషు కాలం నాటివి కావటంతో వాటిని ఆధునికీకరించేందుకు లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నామన్నారు. ప్రజలకు మరింత మెరుగ్గా రైల్వే సేవలను అందించేలా రైల్వే శాఖ అధికారులతో తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రతిపాదనలను కేంద్రానికి పంపుతున్నామని తెలిపారు.



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

తన లోక్‌సభ స్థానం పరిధిలో రైల్వే శాఖకు భారీగా ఆస్తులు, కార్యాలయాలున్నాయని.. వాటిని అభివృద్ధి చేసేలా కృషిచేస్తున్నామన్నారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న అండర్ పాస్ బ్రిడ్జిల పనులను త్వరగా పూర్తిచేసేలా ఆదేశించినట్ట తెలిపారు. ఇటీవల ప్రారంభమైన గౌడవెల్లి అండర్ పాస్ పనులు కూడా త్వరలోనే పూర్తయ్యేలా చూస్తామన్నారు. అలాగే బొల్లారం రైల్వేస్టేషన్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి పనులను త్వరలోనూ ప్రారంభిస్తామన్నారు. ఎంపీ వెంట బీజేపీ మేడ్చల్-మల్కాజ్‌గిరి రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, పార్టీ మేడ్చల్ పట్టణాధ్యక్షుడు కొండం ఆంజనేయులు, నాయకులు రామన్నగారి శ్రీనివాస్‌గౌడ్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిధులు

» ఎమ్మెల్యే చొరవతో కందనెల్లి, చంద్రవంచ, జుంటుపల్లికి విద్యుత్ సబ్‌స్టేషన్లు

» జిన్‌గుర్తిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి



జిన్‌గుర్తిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 33/11కేవీ సబ్‌స్టేషన్

తాండూరు, జూలై 11: తాండూరు నియోజకవర్గంలో ఐదేళ్ల కిందట మంజూరైన కందనెల్లి, చంద్రవంచ, జుంటుపల్లి, జిన్‌గుర్తి గ్రామాలకు 33/11కేవీ సబ్‌స్టేషన్లు మంజూరైన విషయం తెలిసిందే. వాటిలో తాండూరు మండల జిన్‌గుర్తిలో చేపట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి దశకు చేరుకుంది. అయితే, పెద్దేముల్ మండలం కందనెల్లి, యాలాల మండలం జుంటుపల్లి, తాండూరు మండలం చంద్రవంచ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పనులు ముందుకు సాగడంలేదు. స్థలసమస్యలు, ఇతర కారణాల వల్ల పనులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. నిధులలేమితో వాటిని రద్దుచేసినట్లు సమాచారం. తిరిగి స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేకంగా రద్దయిన సబ్‌స్టేషన్‌లను తిరిగి మంజూరు చేయించేందుకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ద్వారా మళ్లీ ప్రయత్నాలు చేసి వాటిని సాధించుకున్నారు. సంబంధిత సబ్‌స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో తిరిగి అంచనాలు తయారు చేసి పంపించాలని విద్యుత్ శాఖకు స్థలాలను వెంటనే గుర్తించి విద్యుత్ శాఖ అధికారులకు అప్పగించాలని రెవెన్యూ శాఖకు ఆదేశాలు అందాయి. ఇప్పటికే తాండూరు మండలం జిన్‌గుర్తిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఒక్కో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రూ.3కోట్ల మేర వ్యయం అవుతుందని అధికారులు అంచనాలు వేశారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఐదేళ్ల కిందట అప్పటి మంత్రి మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యేగా ఎన్నికైన పైలట్ రోహిత్‌రెడ్డి మరోసారి ఈ సబ్‌స్టేషన్లు నిర్మించేందుకు శంకుస్థాపనలు చేశారు. రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం టెండర్ల ప్రక్రియ వరకు వెళ్లి ఆగిపోవడంతో కొంత సబ్‌స్టేషన్ నిర్మాణం జరగలేదు. గతంలో తాండూరు మండలం చంద్రవంచలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రకృతివనం స్థలాన్ని పరిశీలించారు. పెద్దేముల్ మండలం కందనెల్లిలో ప్రభుత్వ భూమిని గుర్తించినప్పటికీ అట్టి భూమి ఎత్తుగా ఉండటంతో లెవలింగ్ చేయాల్సి ఉంది. యాలాల మండలం జుంటుపల్లి సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎండోమెంట్ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో నిర్మాణానికి ఎండోమెంట్ క్లియరెన్స్ రావాల్సి ఉంది.



సాయితేజ



అకాష్

ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడి..

చైన్ స్నాచర్లుగా మారిన బీటెక్ విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 11: ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడిన ఇద్దరు బీటెక్ విద్యార్థులు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, కొండాపూర్‌లో గల దారబోయిన రేణుక టీస్టాల్ నడుపుతుంది. గతనెల 17న ఇద్దరు దుండగులు స్కూటీపై వచ్చి సిగరెట్లు కావాలని రేణుకను అడిగారు. సిగరెట్లు ఇస్తుండగా పుస్తెలతాడు లాక్కొని స్కూటీపై పరారయ్యారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఘట్‌కేసర్‌లోని శివారెడ్డిగూడ వద్ద గురువారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా స్కూటీపై వస్తున్న ఇద్దరిని ఆపి సోదాచేశారు. మహబూబ్‌నగర్‌కు చెందిన దేవరకొండ సాయితేజ(20), మియాపూర్‌కు చెందిన ఉజ్జిని ఆకాష్(20)లు మండలంలోని ఓ ఇంజనీరింగు కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నారు. విచారణ చేపట్టిన పోలీసులు గత నెల 17న కొండాపూర్‌లో దారబోయిన రేణుక మేడలో నుంచి రోల్డ్‌గోల్డ్ పుస్తెలతాడు అపహరించుకెళ్లినట్లు ఒప్పుకున్నారు. తర్వాత యాదాద్రి-భువనగిరి జిల్లా, బొమ్మలరామారంలో ఓమహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడు అపహరించే ప్రయత్నం చేయగా చేతికి అందకపోవడంతో అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. వీరి వద్దనుంచి రోల్డ్‌గోల్డ్ పుస్తెలతాడు, స్కూటీని స్వాధీనం చేసుకొని, ఇద్దరిని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భూములు కోల్పోయాం.. ఇంటి స్థలాలైనా కేటాయించండి

» పరిహార కుంభకోణంపై విచారణ చేపట్టాలి

» సిద్దాపూర్‌లో అసైన్డ్ రైతులు ఆందోళన



సిద్దాపూర్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

కొత్తూర్, జూలై 11: జీవనాధారమైన భూములు కోల్పోయాం.. అరకొర పరిహారం ఇచ్చారు.. భూములు కోల్పోయిన తమకు కనీసం ఇంటి స్థలాలు, సామాజిక అవసరాలకు భూమిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిద్దాపూర్ గ్రామ అసైన్డ్ రైతులు గురువారం పారిశ్రామిక వాడకు కేటాయించిన భూముల్లో ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామ శివారులో 278, 252, 361 సర్వే నెంబర్లలో దాదాపు 330 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో వందలాది మంది రైతులకు అసైన్డ్ చేశారు. ఆ భూమిని కొందరు రైతులు సాగుచేస్తుండగా, మరికొందరు సాగు చేయడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2020లో రైతులకు అసైన్డ్ చేసిన భూమిని నామమాత్ర పరిహారాలు చెల్లించి తిరిగి స్వాధీనం చేసుకుని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం టీఎస్ఐఐసీకి అప్పగించిందని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదిలా ఉంటే, అసైన్డ్ రైతులకు రావాల్సిన పరిహారాన్ని గ్రామానికి చెందిన అప్పటి అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు మధ్యవర్తిత్వం వహించి కొంత సొమ్మును దండుకున్నారని గతంలో రైతులు ఆందోళనలు కూడా చేపట్టారు. సదరు నాయకులు రికార్డులను సైతం తారుమారు చేసి పరిహారాన్ని సొమ్ము చేసుకున్నారని, ఇందుకు సంబంధిత శాఖ అధికారులు వత్తాసు పలికారని రైతులు ఆరోపించారు. పరిహారం విషయంలో కోట్లాది రుపాయలు పక్కదారి పట్టాయని, తమకు న్యాయం చేయాలని గతంలో ఆందోళనలు కూడా చేపట్టారు. కానీ, అసైన్డ్ రైతులను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి విషయాన్ని తీసుకపోగా, ఇటీవల రాష్ట్ర రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సిద్దాపూర్ భూముల విషయమై విచారణ చేపట్టాలని మంత్రి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. అసైన్డ్ రైతులు పారిశ్రామిక పార్కు కోసం కేటాయించిన భూముల వద్ద తిరిగి గురువారం ఆందోళనకు దిగారు. పరిహారం విషయంలో భారీ కుంభకోణం జరిగిందని, తమకు నామమాత్రపు పరిహారం చెల్లించారని అవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వందలాది ఎకరాల భూమిని కోల్పోయామని, కనీసం తాము ఇళ్లు కట్టుకోవడానికి, సామాజిక అవసరాల కోసం 25 ఎకరాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. తమకు న్యాయం జరుగకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



వెలిజర్లలో ఆయిల్ పామ్ మొక్కలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రైతులు మార్కెటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలి

» జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

షాద్‌నగర్ అర్బన్, జూలై 11: రైతులు మార్కెటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని, డిమాండ్‌కు అనుగుణంగా పంటలను సాగు చేసి అధిక దిగుబలు సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల, కొండన్నగూడ గ్రామాల్లో గురువారం సాయంత్రం పంట పొలాలను పరిశీలించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ మొక్కలను, కూరగాయల తోటలను పరిశీలించారు. అనంతరం కొండన్నగూడలో ఏర్పాటుచేసిన పట్టు రీరోలింగ్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల సాగు, మార్కెట్ అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు తమకు కొత్తేనని, కూరగాయ పంటలతో మంచి ఆదాయం వస్తున్నదని రైతులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖల అధికారి నీరజా గాంధీ, ఏడీఏ ముత్యాలు, షాద్‌నగర్ అధికారి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

వికారాబాద్, జూలై 11: దివ్యాంగులందరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వికారాబాద్ డీఆర్డీవో పీడీ ఏ.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాపారంలో రాణించేందుకు ఒక లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. జిల్లాలోని చిన్న, చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న దివ్యాంగులను గుర్తించి, వారికి వారి ప్రతిభకు తగ్గట్లు వారు చేస్తున్న వ్యాపారాలను బలోపేతం చేస్తూ మెరుగైన జీవనోపాధిని పొందడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం గ్రూపులుగా ఏర్పాటు చేసి ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. దివ్యాంగుల పింఛన్ పొందాలంటే సదరం సర్టిఫికెట్ తప్పకుండా అవసరమని అన్నారు. నిరంతరం సదరం సర్టిఫికెట్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి అర్హులైన దివ్యాంగులకు రూ.25వేల ఆర్థిక సాయాన్ని వస్తు రూపేన అందించడానికి 35 మందికి మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు పీఎన్ శ్రీనివాస్, క్లస్టర్ మేనేజర్ అరుణ్ ప్రసాద్‌రెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్ రామేశ్వర్, మెప్మా పీడీ రవికుమార్, జీఎం ఇండస్ట్రియల్ వినయ్‌కుమార్, ఐకేపీ డీపీఎం నర్సింహులు, ఐసీడీఎస్, లబ్ధిదారులు అలవేలు, మాధవి, సునీత, రవీందర్, మల్లేశం, భరత్ పాల్గొన్నారు.

నేడు కందుకూరుకు ఎమ్మెల్యే సబిత రాక

కందుకూరు, జూలై 11: అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడానికి నేడు(శుక్రవారం) మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కందుకూరు మండలానికి రానున్నట్లు ఎంపీడీవో సరిత తెలిపారు. మండలంలోని నేదునూరులో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించి కొత్తగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. 12 గంటలకు కొత్తూరులో అమెజాన్ కంపెనీ సహకారంతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

అన్నదాతలకు అండగా ఉండాలి

» సహకార బ్యాంకు ఉద్యోగులతో ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 11: ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతకు అండగా నిలవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకార బ్యాంకు ఉద్యోగులను ఆదేశించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం డీసీసీబీ, ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ఆరు ప్రాథమిక సహకార సంఘాలలో 22,694 మంది సభ్యులు ఉన్నారని, వారికి రూ.60కోట్ల 58లక్షల రుణాలను ఇచ్చామని డీసీసీబీ మేనేజర్ రవికుమార్ వివరించారు. 3,138 మంది రైతులు రూ.19కోట్ల 77లక్షల రుణమాఫీకి అర్హులని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్ని ప్రాథమిక సహకార సంఘాలలో రైతులు చెల్లిస్తున్న రుణాలకు రసీదులు ఇవ్వడం లేదని, వారి ఆస్తుల మార్టిగేజ్‌లను రిలీజ్ చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. తప్పు చేస్తున్న సీఈవోలు వెంటనే సరిచేసుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే చట్ట ప్రకారం రైతుల నుంచి సభ్యత్వానికి రూ.330 మాత్రమే తీసుకోవాలని, ఎక్కువ తీసుకోవద్దని సూచించారు. రైతులను మోసగించే వారిని ప్రభుత్వం సహించదని, అన్నదాతకు అండగా ఉండేవారే బ్యాంకుల్లో పనిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. సమీక్షలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలు ఎం.వెంకటయ్య, నర్సింహ, వినయ్‌కుమార్, అనిత్‌కుమార్, మహమూద్ షరీఫ్, కె.రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల : ర్యాలీ నిర్వహిస్తున్న డీడీఎంహెచ్‌వో దామోదర్, వైద్యసిబ్బంది

అధిక జనాభాతో అభివృద్ధికి అవరోధం

● డీడీఎంఅండ్‌హెచ్‌వోలు విజయలక్ష్మి, దామోదర్ ● ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ ● పాల్గొన్న వైద్యసిబ్బంది, విద్యార్థులు





షాద్‌నగర్ అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది మాడ్గుల : కేజీబీవీ విద్యార్థినులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఇన్‌చార్జి డాక్టర్ మోహన్

షాద్‌నగర్ అర్బన్, జూలై 11: అధిక జనాబా దేశాభివృద్ధికి అవరోధంగా మారుతుందని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వి.విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ జనాబా దినోత్సవాన్ని పురష్కరించుకుని గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద డాక్టర్ విజయలక్ష్మి ప్రారంభించిన ర్యాలీ చౌరస్తాకు చేరుకుంది. అనంతరం అక్కడ మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో జనాబా పెరుగుతుంటే వనరులు తగ్గుతున్నాయని గుర్తుచేశారు. ప్రతీ జంట ఒకరు ముద్దు, ఇద్దరు హద్దు అన్న సూత్రాన్ని పాటిస్తూ కుటుంబ నియంత్రణ చేయించుకోవాలని కోరారు. ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకొని విధిగా కుటుంబ నియంత్రణ చేయించుకుంటే వారి కుటుంబంతో పాటు దేశం బాగుపడుతుందని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ర్యాలీలో డాక్టర్ స్రవంతి, డాక్టర్ రాఘవేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : కాన్పుకు కాన్పుకు మధ్య గ్యాప్ తప్పనిసరిగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్ తెలిపారు. ప్రపంచ జనాభ దినోత్సవం సందర్భంగా గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు. జనాబా నియంత్రణ పాటించాలన్నారు. సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, వైద్యసిబ్బంది మంజుల, సంతోష, బలరాం, శివరాజ్ తదితరులున్నారు.

మాడ్గుల : అభివృద్ధికి ఆటంకంగా మారిన జనాభాపెరుగుదలను అరికట్టకపోతే రాబోయే రోజుల్లో ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ఇన్‌చార్జి డాక్టర్ మోహన్ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్బంగా మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులతో తహసీల్దార్ కార్యాలయం నుంచి గ్రామపంచాయితీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఈవో దయాకర్, పీహెచ్ఎన్‌లు అలివేలు, మంగమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ మనోహర్‌రెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారి ఇంజమూరి రేఖ, ఏఎన్ఎంలు సంధ్య, జంగమ్మ, రాములమ్మ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.



సీఎంను కలిసిన చల్లా నర్సింహారెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూలై 11 : తెలంగాణ స్టేట్ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కోఆపరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా పదవీ కట్టబెట్టిన సందర్బంగా చల్లా నర్సింహారెడ్డి గురువారం నగరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ తనపై నమ్మకంతో కట్టబెట్టిన పదవికి న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం : వీర్లపల్లి

కొందుర్గు, జూలై, 11: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో మండల పరిధిలోని ఆగిర్యాల గ్రామానికి చెందిన నాగం భాను ప్రసాద్‌కు వినికిడి సమస్య ఉంది. ఈమేరుకు చికిత్స నిమిత్తం 4.50లక్షల ఎల్‌వోసీని ఆయన భాను ప్రసాద్ కుటుంబ సభ్యులకు అందజేశారు. పేద ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందించేందుకు గాను సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, అంజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాలల బహుభాషా నాటకోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ పట్టణ సమీపంలోని హాజీపల్లి ఏవీ కన్వెన్షన్ హాల్లో ఈనెల 20, 21 తేదీల్లో జాతీయ స్థాయి బాలల బహుభాషా నాటకోత్సవాలను నిర్వహించబోతున్నట్లు నవకళా భారతి ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు టీవీ రంగయ్య తెలిపారు. సంస్కార భారతి, నవకళా భారతి ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే బాలల నాటకోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్‌లో ఆవిష్కరించారు. రెండు రోజులపాటు నిర్వహించే నాటకోత్సవంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కళాకారులు హాజరవుతారని తెలిపారు. ప్రప్రథమంగా షాద్‌నగర్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి బాలల బహుభాషా నాటకోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రతీఒక్కరు సహకారం అందించాలని రంగయ్య కోరారు.



కొందుర్గు : ఎల్వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్మశాన వాటిక స్థల వివాదంపై విచారణ చేయాలి

● కొజ్జాగూడ గ్రామస్తుల వేడుకోలు

శంకర్‌పల్లి, జూలై 11 : మండల పరిధి కొజ్జాగూడ గ్రామంలోని శ్మశానవాటిక స్థలం వివాదస్పదంగా మారింది. గ్రామంలో ఎవరైనా చనిపోతే ఖననం, దహనం చేసేందుకు గ్రామస్తులకు హక్కు లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం కొజ్జాగూడ గ్రామస్తులు ర్యాలీగా వెళ్లి ఉప తహసీల్దార్ ప్రియాంకకు తమ సమస్యను వివరించి న్యాయం చేయాలని వినతి పత్రం అందించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండల పరిధిలోని కొజ్జాగూడ రెవెన్యూ సర్వేనంబర్ 85లో ఉన్న శ్మశాన వాటిక స్థలంలో గ్రామస్తులు తరతరాలుగా చనిపోయిన వారిని ఖననం, దహనం చేస్తున్నారు. అయితే, ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రావు అప్పట్లో గ్రామస్తులకు శ్మశాన వాటికకు కేటాయిస్తున్నట్లు మౌఖికంగా తెలిపారు. అయితే, 1.16 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన జొన్నాడ నర్సింలు పేరున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఇప్పుడు దానిని సదరు వ్యక్తి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డు(పహణి)లో 1955 నుంచి భూమి శ్మశానవాటికగా నమోదు చేయబడి ఉందని గ్రామస్తులు తెలిపారు. దాంతోపాటు సర్వేనెంబర్లను కూడా అతడి పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, ఇదే సర్వేనెంబర్‌లో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం భవనాలతోపాటు ఒక గుడి కూడా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. వేణుగోపాల్‌రావు శ్మశాన వాటికకు అప్పగించిన భూమిని ఇతరులు కబ్జా చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న గ్రామస్తులు

మంత్రి పొన్నంను కలిసిన యాదయ్య



చేవెళ్ల, జూలై 11 : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో మంత్రి పొన్నంను కలిసి పుష్పగుచ్ఛం అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయనతో పలువురు నాయకులు ఉన్నారు.

గురుకుల పాఠశాలను ఆమనగల్లుకు తరలించాలి



ఎమ్మెల్యే నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు, జూలై 11: షాబాద్‌లో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు నూతన భవనం నిర్మించి ఆమనగల్లుకు తరలించాలని బీజేవైఎం నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. ఈమేరకు గురువారం బీజేవైఎం జిల్లా నాయకుడు ఆర్. రాజు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. భవనం లేని కారణంగా 2017లో గురుకుల పాఠశాలను షాబాద్‌కు తరలించారని, ఎవరూ పట్టించుకోకపోవడం, భవనం నిర్మించక ఏళ్లకాలంగా ఇతర ప్రాంతంలో పాఠశాల నిర్వహణ వల్ల విద్యార్థినీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనువైన స్థలం కేటాయించి త్వరగా భవనం నిర్మించాలని వినతి పత్రంలో కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు ఉమామహేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

నక్కలపల్లికి ఆర్టీసీ అదనపు బస్సు సర్వీసు

మొయినాబాద్, జూలై 11 : మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు అదనపు ట్రిప్పులను గురువారం సాయంత్రం మొహిదీపట్నం డిపో మేనేజర్ మూర్తి స్థానికులతో కలిసి ప్రారంభించారు. గత నాలుగు సంవత్సరాల నుంచి తోలుకట్ట, ఎత్‌బార్‌పల్లి, నక్కలపల్లి గ్రామలకు బస్సు సౌకర్యాన్ని నిలిపివేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ కోరిక మేరకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో బస్సు అదనపు ట్రిప్పులను మంజూరు చేశారు. గతంలో రోడ్డు పూర్తిగా పాడవడంతో గౌరి సతీష్ సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని గౌరి సతీష్ తెలిపారు. మూడు గ్రామాల ప్రజల కోరిక మేరకు రోడ్డు మరమ్మతులు చేయించడం జరిగిందని, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో అదనపు ట్రిప్పులు వేయించినట్లు చెప్పారు. నాలుగు సంవత్సరాల తరువాత బస్సు పునరుద్దరించి ప్రారంభించడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జహంగీర్, జంగయ్య తదితరులు ఉన్నారు.



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న డీఎం మూర్తి, సతీష్ తదితరులు

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి

కందుకూరు/యాచారం, జూలై 11: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సరిత వైద్య సిబ్బంది, ఆశావర్కర్లను కోరారు. గురువారం కందుకూరు, రాచులూరు, లేమూరు గ్రామాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లతో మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 25 నుంచి ఆగస్టు 15వరకు గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో గ్రామంలో మురుగు గుంతలులేకుండా చేయాలని, మురుగు కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. యాచారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణపై కార్యదర్శులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘న్యాయవాది అరెస్టు సరికాదు’

ఆమనగల్లు/చేవెళ్ల, జూలై 11: సిద్దిపేట జిల్లాకు చెందిన న్యాయవాది రవికుమార్ అరెస్ట్ సరికాదని, ఈ విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరును ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. పోలీసుల తీరును నిరసిస్తూ కోర్టు విధులను బహిష్కరించి న్యాయవాదులు ఆమనగల్లు మున్సిఫ్ కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్ మాట్లాడుతూ న్యాయవాదుల పట్ల పోలీసులు తీరును ప్రతీ ఒక్కరు ఖండించాలని కోరారు. బార్‌అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు అండేకార్ యాదిలాల్, సంయుక్త కార్యదర్శి రామకృష్ణ, లైబ్రేరియన్ శేఖర్, న్యాయ వాదులు మల్లేశ్, సంతోష్, జగన్, గణేశ్, శ్రీనివాస్, బీక్య, సర్దార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా న్యాయవాదిపై పోలీస్‌లు దాడులు చేయడంపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు వారు కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు.

మహిళలతోనే ఆర్థిక పురోగతి

మంచాల, జూలై 11 : మహిళలతోనే కుటుంబం ఆర్థికంగా పురోగతి సాధిస్తుందని మాజీ జడ్పీటీసీ నిత్యనిరంజన్‌రెడ్డి అన్నారు. దుర్గాబాయి మహిళా శిశు సంక్షేమ వికాస కేంద్రం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో దాద్‌పల్లిలో మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించారు. వీరిలో 12 మంది మహిళలకు నిత్యనిరంజన్‌రెడ్డి సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన కుట్టుమిషన్లను గురువారం పంపిణీ చేశారు. హెచ్ఎం యాదగిరి, అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులున్నారు.




కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న నిత్య

280 మందికి ఉచిత వైద్య పరీక్షలు

తలకొండపల్లి, జూలై 11: చుక్కాపూర్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు మహేందర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బీఎన్‌రెడ్డి నీలాద్రి ఆసుపత్రి సహకారంతో శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ కిష్టమ్మ, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డిలు శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 280 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య సంరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు వైద్యులు అవగాహన కల్పించారు.

ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకస్తున్న పప్పు వెంకటశివకుమార్ కాశ్యవన్

యాచారం, జూలై 12 : శ్రీఓంకారేశ్వర ఆలయ అభివృద్ధికి అంకిత భావంతో పని చేస్తానని ఆలయ ధర్మకర్త,ఫౌండర్ ట్రస్టీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పప్పు వెంకటశివకుమార్ కాశ్యవన్ చెప్పారు. గురువారం ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, ఈవో డి.ప్రవీణ్, మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, మహంకాళీ దేవీ ఉపాసకులు పవన్‌కుమార్‌శర్మ, ఆలయపూజారి నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

రాములోరికి ఆభరణాలు బహూకరణ

షాద్‌నగర్ అర్బన్, జూలై 11: షాద్‌నగర్ పట్టణంలో గల రామ్‌మందిర్‌లోని శ్రీరాముడికి గాంధీనగర్‌కు చెందిన సుతారి బాలేశ్వరి వెండి ఆభరణాలను బహూకరించారు. కుటుంబసభ్యులతో కలిసి గురువారం ఆలయంలో పూజలు చేసిన బాలేశ్వరి రూ.44,480 విలువ చేసే వెండి కిరీటం, 10 ముత్యాల హారాలతో స్వామిని అలంకరించి, భక్తిని చాటుకుంది. బాలేశ్వరి కుటుంబ సభ్యులను ఆలయపూజారి, కాలనీవాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు చేగూరి వేణుగోపాల్, ప్రతాప్‌కుమార్, మంజుల, శ్రీకాంత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నగారి ప్రీతమ్ శుక్రవారం పదవీ ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు కడ్తాల మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతుగంటి అశోక్ తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమం విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. అశోక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు ఎస్సీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం సందర్భంగా గాంధీభవన్ నుంచి మాసబ్ ట్యాంక్ సంక్షేమ భవన్ వరకు భారీ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు అశోక్ తెలిపారు.

కడ్తాల్ : మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి బొప్పిడి గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులను సబితాఇంద్రారెడ్డి అడిగి తెలుసుకున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సమయాత్తమై బీఆర్ఎస్ సత్తాను చాటాలని సబితాఇంద్రారెడ్డి సూచించినట్లు గోపాల్ పేర్కొన్నారు. సబితా ఇంద్రారెడ్డి ని కలిసిన వారి లో నాయకులు మహేందర్ రెడ్డి, సాయికుమార్, తదితరులు ఉన్నారు.

తలకొండపల్లి : అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి వారి సొంతింటి కలను సాకారం చేయాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలో పలువురు నిరుపేదల ఇళ్ల నిర్మాణాలు ఆర్థిక ఇబ్బందులతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. అసంపూర్తి పనుల పూర్తికి సహకరించాలని వారు వెంకటేశ్ ను కలిసి అభ్యర్థించారు. స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అవసరమైన మెటీరియల్ ను సమకూర్చారు. గురువారం ఆయా కుటుంబాలకు ట్రస్ట్ సభ్యులు అందజేశారు. మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, యాదయ్య, దశరథ్, వెంకటేశ్, ఈశ్వర్, విఠల్, నర్సింహ్మ, మల్లేశ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ : విద్యార్థులను తరగతి గదిలో ఉత్తములుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని శ్రీరాంనగర్ మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి అన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు బదిలీపైవెళ్లడంతో వారిని ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు సి. జంగయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

కొత్తూర్ : హోటళ్లు, బేకరీలు, స్ట్రీట్ ఫుడ్ యాజమానులు పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవని స్థానిక మున్సిపల్ కమిషనర్ బాలాజీ హెచ్చరించారు. మండల కేంద్రంలోని హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లను కమిషనర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్బంగా కమిషనర్ యాజమానులకు పలు సూచనలు చేశారు. యాజమానులు, వంట, సప్లై సిబ్బంది విధిగా తలకు టోపీలు ధరించాలని, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలని ఆయన సూచించారు.

చేవెళ్ల : విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి షైపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో చేవెళ్ల ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ఉన్న కంట్రోలర్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకనుగుణంగా బస్సులను చేవెళ్లలో రూట్లలో నడిపించాలన్నారు. చేవెళ్లకు నిత్యం వేలాది మంది విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి చదువుకోవడానికి వస్తుంటారని పేర్కొన్నారు. బస్సులు సరిగా లేకోవడంతో విద్యార్థులు కళాశాలకు ఆలస్యంగా వెళ్తన్నారని చెప్పారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



శంషాబాద్, జూలై 11 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని రాళ్లగూడ ఔటర్ రింగురోడ్డు బ్రిడ్జి సమీపంలో గురువారం ఆర్జీఐఏ పోలీసుల ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి ఆడ వేశం వేసుకొని చుట్టుపక్కల బిక్షాటన చేస్తుండేవాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



శ్రీపాల్‌రెడ్డి (ఫైల్)

షాబాద్, జూలై 11 : వ్యక్తి అదృశ్యమైన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గోపిగడ్డ గ్రామానికి చెందిన మోముల శ్రీపాల్‌రెడ్డి ఈనెల 10న వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం పూలపల్లిలో తన మామ దశదిన కర్మకు వెళుతున్నానని ఆయన తల్లి లలితకు చెప్పి బైక్‌పై వెళ్లిపోయాడు. అయితే, అతడు సెల్‌ఫోన్‌ను ఇంట్లో మరిచిపోయాడు. గురువారం పోలపల్లికి వెళ్లి చూడగా శ్రీపాల్‌రెడ్డి రాలేదని బంధువులు తెలిపారు. సోదరుడు జంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



అమరేందర్(ఫైల్)

నందిగామ, జులై 11: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బొమ్మగల్ల అమరేందర్(18) ఇంట్లో సంపు మోటరు ఆన్‌చేసి నీటితో ఇంటి ఆవరణాన్ని శుభ్రం చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురవ్వడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

డ్రగ్స్ కేసులో నిందితుడి రిమాండ్

శంషాబాద్, జూలై 11 : శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు డ్రగ్స్ కేసును ఛేదించారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టుచేసి గురువారం రిమాండ్‌కు పంపారు. రెండు రోజుల క్రితం శంషాబాద్ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్ సమీపంలో డ్రగ్స్ సరఫరా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందగా దాడులు నిర్వహించారు. నిందితుడి నుంచి 9.6 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడు పారిపోగా పోలీసులు గాలింపు జరిపి గురువారం పట్టుకున్నారు. ఈ మేరకు నిందితుడు మురళీధర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్న తెలిపారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

యాచారం, జూలై 11 : మండలంలోని తక్కళ్లపల్లి గేటు వద్ద గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు పెట్రోమొబైల్ పోలీసులు ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. పెట్రోమొబైల్-2 పోలీసులు ఉదయం 4గంటల సమయంలో తక్కళ్లపల్లి గేటు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఓ క్వాలిస్‌ను తనిఖీ చేశారు. దాంట్లో అక్రమంగా నిల్వ ఉన్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం ఎక్కడివని డ్రైవర్ జగన్‌ను ప్రశ్నించడంతో పొంతన లేని సమాధానం చెప్పడంతో క్వాలిస్‌తో పాటు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ తెలిపారు.

వీధికుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

కందుకూరు, జూలై 11: వీధికుక్కల దాడిలో ఓ చిన్నారికి తీవ్ర గాయాలైన ఘటన కందుకూరులో గురువారం రాత్రిచోటు చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన మల్లయ్య మండల కేంద్రంలో స్థిరపడి మిర్చి బండి నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం రాత్రి మిర్చి బండి వద్దకు ఆయన కూతురు సాయిభార్గవి వస్తుండగా వీధికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు వాటిని బెదిరించి చికిత్సనిమిత్తం చిన్నారిని ఆస్పత్రికి తరలించారు. కాగా, మండల కేంద్రానికి సమీపంలో కొత్తగూడ, గూడూరు, కందుకూరు, నేదునూరు తదితర గ్రామాల్లో పౌల్ట్రీఫాంలు ఉండడంతో చనిపోయిన కోళ్లను బయట పడేస్తున్నారని, కుక్కలు వాటిని తిని విచ్చలవిడిగా గ్రామస్తులపై దాడి చేస్తున్నట్లు గ్రామస్తులు, స్థానికులు వాపోతున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

రంగారెడ్డి అర్బన్, జూలై 11: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్లు తమ సమస్యను పరిష్కరించాలని గురువారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. వినతి చేసినవారిలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, షాద్‌నగర్ అధ్యక్షుడు వి.రామారావు, ఆమగల్లు అధ్యక్షుడు పురుషోత్తం, నాయకులు ప్రతాప్‌రెడ్డి, పెంటయ్య, జగదీశ్వర్ తదితరులున్నారు.



అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న పెన్షనర్లు

మొక్కలు నాటి సంరక్షించాలి : ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, జూలై 11 : మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. వానమహోత్సంలో భాగంగా గురువారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలునాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ఆమనగల్లు/కందుకూరు, జూలై 11: పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాయికాడి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో గురువారం శంకర్ పర్యటించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చెట్ల కింద నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించారు. విద్యార్థుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ఈనెల 22న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన కరపత్రాలను శంకర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. కలెక్టరేట్‌కు విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా రూ.730 కోట్లు బకాయిలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, ఆమనగల్లు డివిజన్ కార్యదర్శి కుర్మిద్ద శివ, సాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి నిరుపేదల విద్యార్థులకు చేయుతనందించాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు సిద్దు డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులతో కలిసి కందుకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ,ప్రవేటు కళాశాలలోని విద్యార్థులకు కరపత్రాలను అందజేశారు. విద్యాహి జూనియర్ కళాశాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఆసంఘం నాయకులు వంశీ, ప్రభాకర్, కార్తీక్, బన్నీ, గణేష్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.